ప్రజాశక్తి

గురువారం 13 నవంబర్ 2025 5 విజయనగరం

రెవెన్యూ వసూళ్లు ముమ్మరం చేయాలి : రీజనల్ డైరెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రెవెన్యూ వసూళ్లను ముమ్మరం చేసి సంస్థల ఆర్థిక పరిపుష్టికి కృషి చేయాలని రీజియన్ పరిధిలో ఉన్న అన్ని మున్సిపల్ కమిషనర్లకు రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై చర్చించారు. ముఖ్యంగా రెవెన్యూ వసూళ్లు మందకొడిగా ఉన్న పురపాలక సంఘాలకు ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పనులు త్వరితగతిన వసూళ్లు చేసి లక్ష్యాలను అధిగమించాలని ఆదేశించారు. నీటి చార్జీలను శతశాతం వసూలు అయ్యే విధంగా చూడాలన్నారు. దుకాణాల అద్దెలను వసూలు చేయాలని సూచించారు. పన్ను పరిధిలోకి రాని ఆస్తి వివరాలు నమోదు చేసి పన్ను విధింపు చర్యలు చేపట్టాలన్నారు.

బీమా లేదు..ధీమా లేదు..

- ప్రీమియం చెల్లింపు నుంచి తప్పుకున్న ప్రభుత్వం
- ఘననీయంగా తగ్గినపోయిన పంటల ఇన్సూరెన్స్
- గత ఏడాది 1,62,923 మంది రైతులకు 2.38 లక్షల ఎకరాల విస్తీర్ణం
- ఈ ఏడాది 32,557 మంది రైతులు.. 46,802 ఎకరాలకే

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ప్రీమియం చెల్లింపు నుంచి ప్రభుత్వం తప్పుకోవడంతో ఈ ఏడాది రైతులకు బీమా లేదు... ధీమా లేదు అన్నట్లుగా మారిపోయింది. గత ఏడాదితో పోలిస్తే రైతుల సంఖ్య, ఇన్సూరెన్స్ వర్తించే విస్తీర్ణం ఘననీయంగా తగ్గిపోయింది. అనివార్య కారణాల వల్ల దిగుబడి తగ్గిపోయినా, ప్రకృతి వైపరీత్యాలు, అననుకూల వాతావరణం వల్ల జరిగిన నష్టాలకు గురైనా నష్టపరిహారం వచ్చే అవకాశం లేకుండా పోయింది.

అతివృష్టి, అనావృష్టి వంటి సందర్భాల్లో జిల్లాలో వ్యవసాయ పంటలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి. ఇటువంటి సందర్భాల్లో కనీసం పెట్టిన పెట్టుబడి అయినా వచ్చే విధంగా పంటల బీమా పథకాన్ని ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా గత ఏడాది వరకు జిల్లాలు లేదా ప్రాంతాల వారీ అక్కడ ఎక్కువగా సాగువుతున్న నాలుగు నుంచి ఐదు పంటలకు బీమా పాలసీ ప్రభుత్వం కల్పించేది. అందులో భాగంగానే ఉత్తరాంధ్ర జిల్లాల్లో వరి, మొక్కజొన్న, నువ్వులు, పత్తి పంటలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రైతులు సాగుచేసిన పంటలకు ఇన్సూరెన్స్ కంపెనీలకు రైతుల తరఫున ప్రీమియం చెల్లించేవి. వ్యవసాయ శాఖ సిబ్బంది ఇ-క్రాప్ నమోదు చేసిన సందర్భంలోనే రైతుల పేర్లు, పంటలు తదితర వివరాలతో పంటల బీమాను వర్తింపజేసేవారు. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గత ఏడాది సుమారు రాష్ట్ర వ్యాప్తంగా రూ.1600కోట్లు చెల్లించినట్లుగా సమాచారం. బ్యాంకు రుణాలు తీసుకునే రైతులకు మాత్రం ఆయా సందర్భంలోనే వారి అకౌంట్ నుంచి తప్పనిసరిగా ప్రీమియం ఎమౌంట్ కట్ చేసే విధంగా బ్యాంకులకు ఆదేశాలిచ్చేది. ఫలితంగా పంటనష్టం జరిగిన రైతులకు కొంతమేరకైనా ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి నష్టపరిహారం అందేది. ఈసారి రైతుల స్వచ్ఛంద నిర్ణయం అనే పేరుతో మొత్తం ప్రీమియం చెల్లింపు నుంచి ప్రభుత్వం పూర్తిగా తప్పుకుంది. గత ఏడాది విజయనగరం జిల్లా వ్యాప్తంగా పైన పేర్కొన్న ఐదు పంటలు కలిపి 1,62,923 మంది రైతులు 2,38,560 ఎకరాల మేర బీమా సదుపాయాన్ని పొందారు. ఈఏడాది మాత్రం ప్రీమియం చెల్లింపు బాధ్యత తప్పుకోవడంతో కేవలం 32,557మంది రైతులు 46,802 ఎకరాల విస్తీర్ణంలో మాత్రమే బీమా సదుపాయాన్ని పొందగలిగారు. దీన్నిబట్టి గతంతో పోలిస్తే ఆరోవంతు కన్నా ఎక్కువ శాతం విస్తీర్ణంలోని పంటలు బీమా పథకానికి నోచుకోలేదు. ఇందుకు కారణం లేకపోలేదు.

రైతులకు ఏటా పెరుగుతున్న పెట్టుబడులే గుదిబండగా మారాయి. దీనికితోడు ఈ ఏడాది యూరియా తదితర ఎరువులు ప్రైవేటు మార్కెట్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సివచ్చింది. దీంతో, రైతులు సొంతంగా బీమా సదుపాయం పొందేందుకు ముందుకు రాలేకపోయారు. మరోవైపు గతంతో పోలిస్తే ప్రీమియం కూడా ఎక్కువగానే ఉంది. ఈ ఏడాది అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ (ఎఐసి)తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ కంపెనీ విధించిన విధివిధానాల ప్రకారం.... ఎకరా పత్తి విస్తీర్ణానికి రూ.1923 చొప్పున ప్రీమియం చెల్లించాలి. వరికి రూ.200, మొక్కజొన్నకు రూ.165, నువ్వులకు రూ.65 చొప్పున ప్రీమియం చెల్లించాలి. ఇందుకుగాను పత్తికి రూ.95 వేలు, వరికి రూ.40 వేలు, మొక్కజొన్నకు రూ.33 వేలు, నువ్వులు రూ.13 వేలు చొప్పున బీమా వర్తిస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. కానీ, బీమా పొందిన రైతులు, వర్తించే పంటల విస్తీర్ణం ఘననీయంగా తగ్గిపోవడంతో అనూహ్యంగా రైతులకు నష్టం జరిగినా పరిహారం అందే పరిస్థితి లేకుండా పోయింది.

సొంతింటి కల నెరవేర్చడమే ధ్యేయం

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్
- పిఎంఎవై ఇళ్లకు ప్రారంభోత్సవం

గృహ లబ్ధిదారుకు పత్రాలు అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్, ఎంపి కలిశెట్టి, కలెక్టర్

ప్రజాశక్తి-బొండపల్లి

పేదల సొంతింటి కల నెరవేర్చడమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని రాష్ట్ర చిన్న తరహా పరిశ్రమలు సెర్ప్, ఎన్.ఆర్.ఐ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం అంబటివలస గ్రామంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో భాగంగా మంజూరైన నూతన గృహాలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, జిల్లా కలెక్టర్ ఎస్.రామ సుందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర కాలంలోనే మూడు లక్షల గృహాలను నిర్మించిందని అన్నారు. రాష్ట్రంలో అసంపూర్తిగా ఉన్న గృహాలకు ఆర్థిక సహాయం అందించి వాటిని పూర్తి చేశామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఇవన్నీ అక్షల ఉద్యోగ కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కృషి ఫలితంగా లక్ష కోట్ల రూపాయలు పెట్టుబడులు ద్వారా పారిశ్రామిక అభివృద్ధి జరుగుతున్నదని చెప్పారు. ఈనెల 14,15తేదీల్లో విశాఖలో భారీ స్థాయిలో పెట్టుబడుల సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. కలెక్టర్ ఎస్.రామ సుందర్‌రెడ్డి మాట్లాడుతూ గృహాలు నిర్మించేందుకు ప్రభుత్వం బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు అదనపు సహాయం అందించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపిపి వైస్ చైర్మన్ కోరాడ కృష్ణ, తహశీల్దార్ డి. రాజేశ్వర రావు, ఎంపిడిఒ గిరిబాల, జనసేన నియోజక వర్గ ఇంచార్జ్ మర్రాపు సురేష్, హౌసింగ్ పీడీ గండి మురళీ మోహన్, హౌసింగ్ డిఇ ఎం.సత్యన్నారాయణ, ఎఇ గంటా అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షులు రాపాక అచ్చుం నాయుడు, కొండపల్లి భాస్కర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోజువారీ ఉపాధి లక్ష్యాలను పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కంటోన్మెంట్

ఉపాధి హామీ ద్వారా చేపడుతున్న పనులు రోజువారీ లక్ష్యాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డి ఆదేశించారు. ప్రతి కుటుంబానికి 100 రోజుల పనులు కల్పన కూడా శత శాతం జరగాలన్నారు. బుధవారం ఉపాధి పనులపై టెలికాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ డ్వామా పీడీ, ఎపిడిలు, ఎంపిడిఒలు, ఎపిఒలతో మండలాల వారీ సమీక్షించారు. పని దినాల కల్పనలో వెనుకబడిన మెంటాడ, రామభద్రపురం, సంతకవిటి, రాజాం, కొత్తవలస, భోగాపురం, గుర్ల మండలాలను కలెక్టర్ సమీక్షించారు. ప్రతి మండలంలో కనీసం 1000 మంది ఉపాధి కూలీలకు పని కల్పించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో సరాసరి వేతనం రూ.300గా నిర్దేశించినప్పటికీ, ఈ నెలలో కేవలం రూ. 284 మాత్రమే సాధించడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సంతకవిటి, రాజాం, వంగర, దత్తిరాజేరు, రామభద్రపురం, బాడంగి వంటి మండలాల్లో జిల్లా సరాసరి వేతనం కంటే తక్కువగా ఉండటంపై కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వాతావరణం అనుకూలంగా ఉన్నందున, ఎక్కువ మంది కూలీలు పనులకు హాజరయ్యేలా చేసి సరాసరి వేతనం పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా 100 రోజులు పని పూర్తి చేయడంలో వెనుకబడి ఉందని, ముఖ్యంగా రాజాం క్లస్టర్ లోని మండలాల్లో పని కల్పన ఇంకా పూర్తిగా వెనుకబడి ఉందని , ప్రతి ఒక్కరికీ వంద రోజుల పని కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు, సిఐటియు నాయకులు

పంచాయతీ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - గజపతినగరం

గజపతినగరం, పురిటిపెంట పంచాయతీ కార్మికులకు రెండు నెలల బకాయి జీతాలను తక్షణమే చెల్లించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, కొత్త కార్మికుల నియామకంలో తమ కుటుంబాలకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో గజపతినగరం సచివాలయం వద్ద బుధవారం కార్మికులు ధర్నా చేశారు. అనంతరం గజపతినగరం పంచాయతీ జూనియర్ అసిస్టెంట్‌కి కార్మికులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి. లక్ష్మీ మాట్లాడుతూ ఈ రెండు పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికులకు నెలనెలా జీతాలు ఇవ్వకుండా, రెండు నెలలకు ఒకసారి బిల్లులు పెడుతున్నారని, దీని వల్ల కార్మికులు నెలనెలా ఇబ్బందులు పడుతున్నారని, వారి కుటుంబాలు డ్వాక్రా చెల్లింపులు, వైద్యం, విద్య, తిండి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. అధికారులు మిగిలిన అన్ని బిల్లులనూ సకాలంలో చెల్లిస్తున్నప్పటికీ, కార్మికుల జీతాల విషయంలో మాత్రం జాప్యం చేస్తున్నారని గుర్తు చేశారు. కొత్తగా కార్మికులను వేసుకునేటప్పుడు పాత కార్మిక కుటుంబాలకి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలనే నిబంధనను పాటించకుండా, కార్మికులతో చర్చించకుండా ఇతర కార్మికులను నియమించుకోవడం సరికాదని తెలిపారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 14వ తేదీ నుండి పనులను నిలుపుదల చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మికులు బి. కనకరాజు, నాగేశ్వరరావు, పి. కోటేశ్వరరావు, ఎస్. కృష్ణ, డి. భాస్కరరావు, ఈశ్వరరావు, డి. గోవిందా, డి.లక్ష్మి, బి.పద్మావతి పాల్గొన్నారు.

పిల్లల మరణానికి న్యుమోనియా ఒక కారణం

డిఎంహెచ్ఒ ఎస్.జీవన్ రాణి

పోస్టర్ ఆవిష్కరిస్తున్న డిఎంహెచ్ఒ జీవన్‌రాణి, వైద్యాధికారులు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

పిల్లల మరణాలకు న్యుమోనియా ఒక కారణమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎస్.జీవన్ రాణి అన్నారు. బుధవారం ప్రపంచ న్యుమోనియా దినోత్సవాన్ని వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈనెల 12 నుంచి ఫిబ్రవరి 27 వరకు అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. నూమోనియా ఎక్కువగా ఐదేళ్లలోపు పిల్లల్లో ఎక్కువగా వస్తుందని, ఈ వ్యాధి శీతాకాలంలో ఎక్కువగా కనిపిస్తుందని తెలిపారు. జలుబు, దగ్గు, జ్వరం, వేగంగా శ్వాస తీసు కోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. పుట్టిన్న ప్రతి బిడ్డకూ పిసివి టీకాలు వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాధికారి డాక్టర్ ఆర్.అచ్చుత కుమారి, అదనపు డిఎంహెచ్ఒ కె.రాణి , డిప్యూటీ డిఎంహెచ్ఒ ఎన్.సూర్య నారాయణ, పిఒఎన్‌సిడి వివిబి సుబ్రమణ్యం , డెమో వి. చిన్నతల్లి ,తదితరులు పాల్గొన్నారు.

న్యుమోనియా పట్ల జాగ్రత్తలు అవసరం

న్యుమోనియా పట్ల జాగ్రత్తలు అవసరమని తిరుమల మెడికవర్ ఆసుపత్రి పల్మనాలజిస్ట్ డాక్టర్ విజయ్ అన్నారు. వరల్డ్ న్యుమోనియా డే సందర్భంగా ఆస్పత్రిలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. న్యుమోనియా పట్ల అప్రమత్తంగా లేకుండా ప్రాణపాయం రావచ్చునని తెలిపారపు. ఊపిరితిత్తులలో ఇన్ఫెక్షన్ వలన ఈ వ్యాధి వస్తుందని, గుండెల్లో నొప్పి, ఆయాసం నోటినుండి రక్తం రావడంఈ వ్యాధి లక్షణాలని తెలిపారు. స్మోకింగ్, మద్యం అలవాట్లు వల్ల ఈ వ్యాధి రావచ్చని తెలిపారు. లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించాలని తెలిపారు. న్యుమోనియా నివారణకు వాక్సిన్ అందుబాటులో ఉందని,

టెన్త్ పరీక్ష ఫీజు చెల్లింపునకు 25వరకు గడువు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మార్చిలో పదోతరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులు ఫీజు చెల్లింపునకు షెడ్యూల్‌ను డిఇఒ యు.మాణిక్యం నాయుడు బుధవారం విడుదల చేశారు. రెగ్యులర్ విద్యార్థులు, ఒకసారి ఫెయిల్ అయిన విద్యార్థులు, ఒకేషనల్ విద్యార్థులు ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా ఈనెల 13 నుంచి 25 వరకు ఫీజు చెల్లించ వచ్చునని తెలిపారు. ఆ తర్వాత రూ.50 ఆలస్య రుసుముతో డిసెంబరు 3 వరకు, రూ.200 ఆలస్య రుసుముతో డిసెంబరు 10 వరకు, రూ.500 ఆలస్య రుసుముతో డిసెంబరు 15 వరకూ పరీక్ష ఫీజు చెల్లించడానికి అవకాశం ఉందని తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.125, ఒకసారి ఫెయిల్ అయిన విద్యార్థులు 3 కంటే ఎక్కువ సబ్జెక్టులకు రూ.125, మూడు సబ్జెక్టుల వరకు రూ.110, వృత్తి విద్య విద్యార్థులు అదనంగా రూ.60, వయసు నిర్ధారణ రుసుము రూ.300చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. https://bse.ap.gov.in లో అందుబాటులో ఉన్న పాఠశాల లాగిన్ ద్వారా మాత్రమే విద్యార్థులు ఫీజు చెల్లించాలని తెలిపారు.

భూములను వేగంగా అందజేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కంటోన్మెంట్

రెవిన్యూ నుండి పలు ప్రోజెక్టులకు ఇవ్వవలసిన భూములను వేగంగా ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి తెలిపారు. బుధవారం రెవిన్యూ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. మురుగునీరు ట్రీట్మెంట్ ప్లాంట్ కు మున్సిపాలిటీలలో ప్రభుత్వ భూమిని గుర్తించాలని, భూమి లేనియెడల భూ సేకరణకు వెళ్లాలని, ఆర్‌డిఒలు , మున్సిపల్ కమిషనర్లు కలిసి చర్చించు కోవాలని సూచించారు. బిఎస్ఎ న్ ఎల్ వారు 22 టవర్ల ఏర్పాటుకు భూమిని కోరారనిన, డెంకాడ మండలం పెద తాడివాడలో విద్యుత్ శాఖ 33/11 కెవి స్టేషన్ ఏర్పాటుకు భూమి అడిగారని, వీటిని త్వరగా డిస్పోజ్ చేయాలని అన్నారు. అందరికీ ఇళ్లు పథకం కింద అందిన దరఖాస్తులను వేగంగా పరిశీలించి అర్హులకు అవసరమైన భూమిని గుర్తించాలని తెలిపారు. విసిలో డిఆర్ఒ శ్రీనివాస మూర్తి, సూపరింటెండెంట్ తాడ్డి గోవింద పాల్గొన్నారు.

అక్రమ బోర్లకు బిల్లులు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి : గొంప

ప్రజాశక్తి-వేపాడ

నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ నిధులతో ప్రైవేటు స్థలాల్లో బోర్లు తవ్వకాలకు సంబంధించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని టిడిపి అధికార ప్రతినిధి గొంప కృష్ణ అన్నారు. మండల పరిషత్తు అభివృద్ధి నిధుల నుండి 2024 డిసెంబర్‌లో వైసిపి నాయకులకు అనుకూలంగా వారి కళ్లల్లో జిరాయితీ భూముల్లో బోరు బావులు తవ్వి కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించేందుకు జెఇ దేవి రికార్డు తయారు చేసిన విషయం సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు అప్పటి కలెక్టర దృష్టికి తీసుకెళ్లడంతో బిల్లులు చెల్లించవద్దని ఆదేశించారని తెలిపారు. మళ్లీ ఏదో ఒక విధంగా బిల్లులు చెల్లించేందుకు తాపత్రయం పడడం సరైనది కాదని పలువురు అంటున్నారు. ఈ విషయమై గొంప కృష్ణ స్పందిస్తూ తప్పుడు నివేదిక ఇచ్చిన జెఇపై చర్యతీసుకోవాలన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణ మానుకోవాలి

- వైసిపి ఆధ్వర్యాన నిరసన ర్యాలీలు
- ఇది చంద్రబాబు దుర్మార్గపు ఆలోచన : బొత్స

ప్రజాశక్తి-చీపురుపల్లి

రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైసిపి ఆధ్వర్యాన జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో బుధవారం ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. గరివిడి నుంచి ద్విచక్ర వాహన ర్యాలీతో చీపురుపల్లి తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం తహశీల్దార్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలకు ఉచితంగా అందజేస్తున్న వైద్యం, విద్య రెండింటిని ప్రైవేటుపరం చేసి కాసులు గుంజుకోవాలన్న దుర్మార్గపు ఆలోచనను చంద్రబాబు మానుకోవాలని హెచ్చరించారు. సామాన్య ప్రజలకు ఉచిత వైద్యంతో పాటు ఉచిత వైద్య విద్యను అందజేయాలన్న లక్ష్యంతో వైసిపి హయాంలో రాష్ట్రంలో సుమారు 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను ఏర్పాటు చేశామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీటిని ప్రైవేటుపరం చేస్తూ పేద విద్యార్థులకు వైద్య విద్యతోపాటు, పేదలకు వైద్యాన్ని కూడా దూరం చేసిందన్నారు. ఈనేపథ్యంలో ప్రజల గొంతును గవర్నర్‌కు తెలియజేయాలన్న లక్ష్యంతో వైసిపి ఆధ్వర్యాన నిరసన కార్యక్రమాలు చేపట్టామన్నారు. కూటమి ప్రభుత్వ అరాచక పాలనను ప్రజలు గమనిస్తున్నారని, వైయస్సార్ జగన్ మోహన్ రెడ్డి పాలన మళ్లీ రాష్ట్రంలో రావడం తథ్యమని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, మండల పార్టీ నాయకులు వలి రెడ్డి శ్రీనివాస నాయుడు, ఇప్పిలి అనంతం, మీసాల వరహాల నాయుడు, వైసిపి నాయకలుఉ, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

గజపతినగరం : మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య ఆధ్వర్యాన ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న వైఎస్సార్ విగ్రహం నుంచి ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ రత్నకుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అప్పలనర్సయ్య మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే ఈ ప్రజా వ్యతిరేక నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జడ్‌పిటిసి గార తౌడు, వైసిపి నాయకులు బెల్లాన త్రినాధరావు, జైహింద్, బూడి వెంకటరావు, కరణం ఆదినారాయణ, మండల సురేష్, గేదెల జగదీష్, రంగుపురం సర్పంచ్ లక్ష్మణరావు, మంత్రి సూర్య, పప్పల గురు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శృంగవరపుకోట : రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వ విద్య, వైద్యం జగనన్నతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే శోభ హైమావతి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడు బాబు అన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి తాహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తాహశీల్దార్ శ్రీనివాసరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో స్థానిక జెడ్‌పిటిసి ఎం.వెంకటలక్ష్మి, వైసిపి నాయకులు మోపాడ కుమార్, మమ్ములూరి జగన్నాధం, గుమ్మడి సత్యన్నారాయణ, ఎంపిపిలు నీలంశెట్టి గోపమ్మ, దొగ్గ సత్యవంతుడు, గేదెల శ్రీనివాసరావు, సబ్బవరపు అరుణ, తుర్పాటి వరలక్ష్మి, బొంతల వెంకటరావు, నాయకులు వాకాడ రాంబాబు, మూకల కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం టౌన్ : మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని వైసిపి మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి డిమాండ్ చేశారు. సిఎంఆర్ జంక్షన్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సంద్భంగా కోలగట్ల మాట్లాడుతూ వైద్య విద్యను అభ్యసించాలనుకునే పేద విద్యార్థులకు తీరని అన్యాయం చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వం పిపిపి పేరుతో 10 కొత్త మెడికల్ కాలేజీలు ప్రైవేటీకరించాలని నిర్ణయించిందన్నారు. వెంటనే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రావణి, పార్టీ నగర అధ్యక్షులు ఎ.వేణు, పలువురు కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : వైద్య కళాశాలలను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పి.సురేష్‌బాబు డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా కోటి సంతకాలు సేకరణ చేపట్టారు. రామతీర్థం జంక్షన్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం డిటి వివిఆర్ జగన్నాధరావుకు వినతి అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు అంబళ్ల సుధారాణి, పతివాడ అప్పలనాయుడు,ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, గదల సన్యాసి నాయుడు, చిక్కాల సాంబ శివరావు, పడాల భానుప్రకాష్, మహంతి జనార్ధన్, మహంతి శ్రీను, పిన్నింటి తమ్మినాయుడు, నెల్లిమర్ల వైస్ ఎంపిపిలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం, సముద్ర రామారావు, కారుకొండ కృష్ణ, బడ్డుకొండ ప్రదీప్, మత్స సత్యనారాయణ, రేగాన శ్రీనివాసరావు, దవళ లక్ష్మణరావు, పతివాడ కృష్ణ వేణి పాల్గొన్నారు.



చీపురుపల్లి : ర్యాలీలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు బొత్స సత్యనారాయణ

బొబ్బిలి : ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ చేయవద్దని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి అనుమతి లేదని పోలీసులు అడ్డుకున్నారు. 30మందికి మాత్రమే అనుమతి ఇవ్వడంతో ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అందజేశారు.

రాజాం : నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ తలే రాజేష్ ఆధ్వర్యంలో జిఎంఆర్ ఐటి నుంచి ఎమ్మార్వో కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్ రాజ్‌కు వినతి అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు టంకాల అచ్చెన్నాయుడు, జిల్లా వైస్ చైర్మన్ సిరిపురం జగన్ మోహన్ రావు, ఎంపిపిలు యు.సురేష్ ముఖర్జీ, దార అప్పల నరసమ్మ, లావేటి సులోచన, రాజ్ గోపాల్ నాయుడు, జెడ్‌పిటిసిలు కరణం సుదర్శన్ రావు, బండి నర్సింహులు, రాజాం టౌన్ పార్టీ అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, వవిలపల్లి జగన్ మోహన్ రావు, నక్క వర్షిణి, యలాల వెంకటేష్, గరుగుబెల్లి స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాజాం : బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

గజపతినగరం : భారీ ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

బిపిఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బిపిఎస్ ప్రకారం ఈ ఏడాది ఆగస్టు 31కి ముందు నిబంధనలకు విరుద్ధంగా లేదా అనుమతి లేకుండా కట్టిన భవనాలను రెగ్యులరైజేషన్ చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని నగర పాలక సంస్థ కమీషనర్ నల్లనయ్య ఒక ప్రకటనలో తెలిపారు. 1985 జనవరి 1 నుంచి 2025 ఆగస్టు 31 మధ్య మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర్ పంచాయతీలు, అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పరిధిలో భవన నిర్మాణాలు మాత్రమే అర్హత అని తెలిపారు. www.bps.ap.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. భవన యజమాని లేదా లైసెన్స్ టెక్నికల్ పర్సం ద్వారా దరఖాస్తు చేయాలన్నారు. సొంత ధ్రువపత్రం, భవనం ఫోటోలు, స్ట్రక్చరల్ స్టెబిలిటీ సర్టిఫికేట్, ఇండెమ్నిటీ బాండ్ (జామీన్) వంటి కావలసిన డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలని తెలిపారు.ప్రభుత్వం నిర్ణయించిన జరిమానా చెల్లించి, తమ భవనాలను చట్టబద్ధం చేసుకోవాలని తెలిపారు.

కాంట్రాక్టర్ల సమస్యల పరిష్కారానికి కృషి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరాభివృద్ధిలో భాగస్వామ్యులుగా ఉండే కాంట్రాక్టర్లను ఇబ్బంది పెట్టే యోచన తమకు లేదని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. బుధవారం కాంట్రాక్టర్లతో తన ఛాంబర్ లో సమావేశం ఏర్పాటు చేశారు. ఇంజినీరింగ్, అకౌంట్స్ విభాగాలు సమన్వయంతో వారంలోగా కాంట్రాక్టర్ల సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. ఇప్పటివరకు సమర్పించిన బిల్లులను మంజూరు చేశామన్నారు. ఇఎండిల జాబితా సమర్పించిన తక్షణమే పరిష్కరించే విధంగా చూస్తామన్నారు. కాంట్రాక్టర్లు, అధికారుల మధ్య సమన్వయ లోపం లేకుండా నెలకోసారి సమావేశం ఏర్పాటు చేస్తే మంచిదని సూచించారు. సమావేశంలో ఎగ్జామినర్ రూథర్ పాల్, ఇఇప్రసాదు, గణాంక అధికారి రోజా రాణి, నర్సింగ రాజు, శివరామ కిరణ్, మున్సిపల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కమిషనర్ ఇచ్చిన హామీలు రాత పూర్వకంగా ఇస్తేనే ఆందోళన విరమిస్తామని సోసియేషన్ నాయకులు అశోక్, బంగార్రాజు, రాజ్ కుమార్ తెలిపారు.

కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

'ఉపాధి' పనులు వేగవంతం

ప్రజాశక్తి- మెరకముడిదాం

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వ్యక్తిగత పనులకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, పనులు గుర్తించి పనులను వేగవంతం చేయాలని బుధవారం సిబ్బందికి ఎంపిడిఒ గొర్లె భాస్కరరావు సూచించారు. మెరకముడుదాం పంచాయతీలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. హార్టికల్చర్, ఫారం పాండ్లు, భూమి అభివృద్ధి పనులు, కంపోస్టు పిట్స్, సోక్ పిట్స్ పనులను గుర్తించి వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

ఇళ్ల నిర్మాణానికి సర్వే

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో ఇంత వరకు ఇళ్లు మంజూరు కాని వారిని గుర్తించే సర్వే బుధవారం బానాదిలో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యంలో చేపట్టారు. నూతనంగా ఇళ్లు నిర్మించుకోవాలనుకునే వారు ఈ నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. సర్వేలో ఇంజనీరింగ్ అసిస్టెంట్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

14 నుంచి సదరం నమోదు

ప్రజాశక్తి - వేపాడ

ఈ నెల 14 నుంచి వికలాంగులకు సదరం ప్రారంభిస్తారని ప్రభుత్వ ఆస్పత్రిల్లో సదరం నమోదు చేసుకోవాలని ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శారీరక, మానసిక, బదిరీలు, దృష్టి, వైకల్యం ఉన్నవారు సచివాలయంలో స్పాట్ బుక్ చేసుకోవాలని సూచించారు.

పాఠశాలలో తనిఖీలు

ప్రజాశక్తి - బొబ్బిలి

స్థానిక తారకరామ కాలనీ మున్సిపల్ పాఠశాలను బుధవారం ఎమ్మెల్యే బేబినాయన తనిఖీ చేశారు. పాఠశాలకు వెళ్లిన ఎమ్మెల్యేకు విద్యార్థులు ప్లకార్డులతో స్వాగతం పలికారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని హెచ్ఎం ఉషారాణిను ఆదేశించారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం పని చేస్తుందని చెప్పారు. 40 రోజుల ఛాలెంజ్ పోస్టర్లను విడుదల చేశారు. ఆయనతో ఎంఇఒ సిహెచ్ రమేష్, టిడిపి నాయకులు ఉన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని స్థానిక శాఖా గ్రంథాలయంలో ఈనెల 14వ తేదీ నుండి 20వ తేదీ వరకు 58వ జాతీయ వారోత్సవాలను నిర్వహిస్తామని గ్రంథాలయాధకారి కె. శ్రీనివాస్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 14వ తేదీన వారోత్సవాలను ప్రారంభిస్తామని, 15వ తేదీన పుస్తక ప్రదర్శన 18,19వ తేదీలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలను నిర్వహిస్తామన్నారు.20వ తేదీన ముగింపు సభ పెట్టి విజేతలకు బహుమతులు అందిస్తామన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపుపై శిక్షణ

ప్రజాశక్తి- రాజాం

మండలంలోని బొద్దాం పిహెచ్‌సిలో బుధవారం కుష్టు వ్యాధి గ్రస్తుల గుర్తింపుపై సిబ్బంది శిక్షణ ఇచ్చారు. ఈ నెల 17 నుంచి 30వ తేదీ వరకూ పిహెచ్‌సి పరిధిలో ఆశా వర్కర్ల గుర్తింపు కార్యక్రమాన్ని చేపట్టాల్సి ఉంది. ఇందులో భాగంగా సోపేరు గ్రామంలో ప్రజలకు కుష్టు వ్యాధి నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బొద్దాం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సిద్దేశ్వరి మాట్లాడుతూ కుష్టు వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించడం ద్వారా సులభంగా నివారించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శశికరణకుమారి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాలు పరిశీలన

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని రావివలస, కొర్లాం, మదనాపురం గ్రామాలలో బుధవారం చేపట్టిన పంట కోత ప్రయోగాలను జిల్లా వ్యవసాయాధికారి విటి రామారావు పరిశీలించారు. పంట కోత ప్రయోగం తరువాత అక్కడే నూర్చి దిగుబడి లెక్కించారు. అక్కడే సీసీ ఎక్స్‌పెరిమెంట్‌లను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఎఆర్‌సి ఎడిఎ జెడి భారతి, సబ్ డివిజన్ ఎడిఎ నాగభూషణ్, డిఆర్‌సిఎడి ఏ.భారతి, డిఆర్‌సి ఎఒ ధర్మల్, మండల వ్యవసాయ అధికారి బి శ్యామ్ కుమార్, ఎఇఒలు, విఎఎలు, ఇన్సూరెన్స్ ఏజెంట్లు రైతులు పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు మహాసభలకు ఆహ్వానం

ప్రజాశక్తి- బొబ్బిలి

ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో గుంటూరు శ్రీసత్యసాయి స్పిరిచువల్ సిటీ ప్రాంగణంలో నందమూరి తారక రామారావు వేదికపై జనవరి 3,4,5 తేదీల్లో నిర్వహిస్తున్న 3వ ప్రపంచ తెలుగు మహాసభలకు మండలంలోని కోమటిపల్లి గ్రామానికి చెందిన బొంతలకోటి శంకరరావు ఆహ్వానం లభించింది. ఈ ఆహ్వానంలో తూర్పు భాగవతం ద్వారా తెలుగు సంస్కృతికి, తెలుగు భాషా వికాసానికి చేస్తున్న కృషికి ఆయనకు పూర్ణకుంభ పురస్కారంను అందజేస్తున్నట్లు లేఖ ద్వారా తెలిపారు.

14న ఉపకరణాలు గుర్తింపు శిబిరం

ప్రజాశక్తి - డెంకాడ

18 ఏళ్ల లోపు ప్రత్యేక అవసరాల గల పిల్లలకు ఈ నెల 14వ తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉచిత పరికరాల గుర్తింపు శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఇఒలు కెవి రమణ, ఆర్.కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లిమర్ల, విజయనగరం నియోజకవర్గాల పరిధిలోని విజయనగరం, నెల్లిమర్ల, భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాల, కళాశాలలోనూ చదువుతున్న 18 ఏళ్ల లోపు ప్రత్యేక అవసరాల పిల్లలు అర్హులని తెలిపారు. ఈ శిబిరానికి హాజరయ్యే వికలాంగ విద్యార్థులు సదరం యుడిఐడి, ఆధార్, రేషన్ కార్డుతో పాటు రెండు ఫోటోలు తీసుకురావాలన్నారు.

15న ఉపకరణాల గుర్తింపు శిబిరం

శృంగవరపుకోట: ఈ నెల 15వ తేదీన పట్టణంలోని చింత స్కూల్ వద్దగల భవిత సెంటర్లో నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల వికలాంగులకు ఉపకరణాల కోసం గుర్తింపు కార్యక్రమం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తామని ఎంఇఒ బి.నర్సింగరావు బుధవారం తెలిపారు. మరిన్ని వివరాలకు 9387240784 -9553261727 నంబర్లకు సంప్రదించాలన్నారు.

సచివాలయాల సందర్శ

దత్తరాజేరు: మండలంలోని పెదమానాపురం, దత్తి, వంగర, పెదకాద సచివాలయాలను మండల ప్రత్యేక అధికారి, ఐసిడిఎస్ పీడీ టి.విమలారాణి బుధవారం సందర్శించారు. సచివాలయాల రికార్డులను, సర్వేల పురోగతిని పరిశీలించి పిజిఆర్ఎస్ అర్జీదారులతో మాట్లాడారు. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని, పాటించని సిబ్బందిపై పంచాయతీ కార్యదర్శి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టైపిస్ట్ రవిశంకర్, కార్యదర్శిలు పాల్గొన్నారు.

యువకుడిపై దాడి

రాజాం: పట్టణంలో ఓ ప్రైవేట్ డిగ్రీ కాలేజీ నుంచి బయటకు వస్తున్న విద్యార్థి బండి ప్రేమ్‌కుమార్ పై నలుగురు యువకులు మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ దాడిలో పట్టణంలో రెల్లి వీధికి చెందిన బండి ప్రేమ్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన విద్యార్థిని కుటుంబ సభ్యులు రాజాం ప్రాంతీయ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. దీంతో రాజాంలో ఉద్రిక్తత వాతావరణం చోటు చేసుకుంది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో 7 రోజులు జైలు

శృంగవరపుకోట: పట్టణ పోలీసు స్టేషను పరిధిలో బుధవారం మద్యం సేవించి వాహనం నడిపిన మండలంలోని శివరామరాజు పేట గ్రామానికి చెందిన నిందితుడు కపిరెడ్డి అప్పారావుకు ఎస్.కోట స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గండి అప్పల నాయుడు 7 రోజుల జైలు శిక్ష విధించినట్లుగా ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే శిక్ష జరిమానా తప్పవని ఆయన హెచ్చరించారు.

వాతావరణంలో మార్పుతో రైతుల్లో గుబులు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో ఇప్పటికే ఖరీఫ్ వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రస్తుత వాతావరణంలో మార్పులు వచ్చి మబ్బులు వేయడంతో ఏ క్షణంలోనైనా వర్షం పడే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో చాలా మంది రైతులు కోసి పొలంలో ఉన్న వరి పంటను చిన్న చిన్న కుప్పలుగా పెట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు.

నెరవేరిన సొంతింటి కల : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - తెర్లాం

కూటమి ప్రభుత్వంతోనే పేదల సొంతింటి కల సాధ్యమవుతోందని ఎమ్మెల్యే బేబినాయన, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు అన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద మండల కేంద్రం, చిన్నయ్యపేటలో నిర్మించిన ఇళ్లను వారు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో మొత్తం 1057 మంది లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేశామని, ఇంకా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ నర్సుపల్లి వెంకటనాయుడు, తెర్లాం మండల టిడిపి అధ్యక్షులు నర్సుపల్లి వెంకటేష్, సర్పంచ్ రూప, ఎంపిటిసి జి.ఆనందరావు, అధికారులు, టిడిపి నాయకులు,పాల్గొన్నారు.

కొత్తవలస: నియోజకవర్గంలో 6353 ఇంటి నిర్మాణాలు పూర్తయ్యాయని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. బుధవారం మంగళపాలెంలో నిర్మించిన 9 ఇళ్లను ఆమె ప్రారంభించి లబ్ధిదారులకు నూతన వస్త్రాలు, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దాసరి కార్పొరేషన్ చైర్మన్ పొట్నూరు వెంకట రత్నాజీ, టిడిపి మండల అధ్యక్షులు కోళ్ల శ్రీను, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ సేనల నానాజీ, ప్రధాన కార్యదర్శి కనకాల శివ, ఉపాధ్యక్షులు ఎల్లపు సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం కోట : మండలంలోని దుప్పాడ, నగరంలోని కనపాకలో పలువురికి మంజూరై నిర్మించుకున్న పిఎంఎవై ఇళ్లను

తెర్లాం: ఇంటిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

ఎమ్మెల్యేపి.అదితి విజయలక్ష్మి, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు బుధవారం ప్రారంభిచంఆరు. దుప్పాడలో లబ్ధిదారులైన మజ్జి ఈశ్వరమ్మ భర్త లక్ష్మణరావుకు ఇంటి తాళాలు అందజేసి రిబ్బన్ కట్ చేసి గృహ ప్రవేశం చేశారు. కనుపాకకు చెందిన కోట కృష్ణవేణి భర్త శ్రీనివాసరావు ఇంటికి సంబంధించి భూమి పూజ నిర్వహించారు. రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ పాలవలస యశస్విని, పట్టణ పార్టీ అధ్యక్షులు గంటా రవి, కార్యదర్శి కోదండరాం, మండల పార్టీ అధ్యక్షులు గంటా పోలి నాయుడు, ప్రధాన కార్యదర్శి పాశి అప్పలనాయుడు, రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, జొన్నవలసి ఎంపిటిసి రాజేష్ బాబు, రాకోడు పినవేమలి ఎంపిటిసి వేచలపు శ్రీనివాసరావు, 46వ డివిజన్ నాయకులు కోండ్ర శ్రీను, నాయకులు రాంబాబు, చంద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే

రాజాం: స్థానిక మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ బుధవారం ప్రారంభించారు. బహిరంగ మార్కెట్ కంటే ఎక్కువగా క్వింటా ఒక్కింటికి రూ.8,110 మద్దతు ధర నిర్ణయించినందున, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం ఏఎంసిలో ఉమ్మడి విజయనగరం జిల్లా, మన్యం జిల్లాల ఏఎంసి చైర్మన్లు, వైస్ చైర్మన్‌ల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అపంతరం మండలంలోని శ్యాంపురంలో నూతన గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 200 గృహ ప్రవేశాలు జరిగాయన్నారు. అనంతరం గృహ నిర్మాణానికి మంజూరైన పత్రాలను మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు నంది సూర్య ప్రకాశరావు, గురవాణ నారాయణరావు, సుమల వెంకట మన్మథరావు, లచ్చుభుక్త ధనలక్ష్మి, శాసపు రమేష్ కుమార్, సమతం శ్రీను, మహేష్, వల్లూరి గణేష్, అప్పలనాయుడు, ఉమ్మడి జిల్లాల మార్కెట్ యార్డు చైర్మన్‌లు, వైస్ చైర్మన్‌లు, డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

త్రిచక్ర వాహనాలకు 25లోగా దరఖాస్తులు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఈ నెల 25లోగా వికలాంగులు త్రిచక్ర వాహనాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ కె. రామకృష్ణరాజు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం వికలాంగులను ప్రోత్సాహించడం కోసం ఉచితంగా మోటార్ త్రిచక్ర వాహనం పథకం ప్రవేశపెట్టిందన్నారు. ఈ నేపథ్యంలో అర్హులైన వికలాంగులు ఈ నెల 25లోగా మోటార్ త్రిచక్ర వాహనం కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకొనే సమయానికి 45 సంవత్సరాల వయసు, రెగ్యులర్‌గా చదువుతున్న విద్యార్థులు, స్వయం ఉపాధి, వ్యవసాయ అనుబంధ రంగాల్లో వేతనంతో పని చేస్తున్న 10తరగతి అర్హత ఉన్న వారు ధ్రువ పత్రం, ఆధార్ కార్డు, పదవ తరగతి సర్టిఫికెట్, ఆదాయం తాజా ధ్రువపత్రం, విద్యార్థుల బోనఫైడ్ సర్టిఫికెట్, ఉపాధి ధ్రువ పత్రం, పాస్ ఫోటో జతపర్చి ఈ నెల 25లోగా ఆన్‌లైన్‌లో ఆంధ్రప్రదేశ్ వికలాంగుల, వృద్ధుల సహాయ సంస్థ www.apdascac.ap.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

చెరువు ఆక్రమణపై విచారణ

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలోని బుధరాయవలస రెవెన్యూ పరిధిలో వున్న చెరువు గర్భం ఆక్రమణకు గురైనట్లు బుధరాయవలస గ్రామానికి చెందిన ఎలకల శంకరరావు లోకాయుక్తలో చేసిన ఫిర్యాదు మేరకు అటవీశాఖ స్పెషల్ ఆఫీసర్ ఎం.నూకరాజు బుధవారం విచారణ చేపట్టారు. గ్రామానికి ఆనుకొని వున్న సర్వే నెంబర్ 7లో చెరువు విస్తీర్ణం 9.91 ఎకరాలు, సర్వే నెంబర్ 14లో 2.2 ఎకరాలలో ఎలకల వెంకటి, ఎలకల చిట్టమ్మ ఆక్రమించుకున్నారని లోకాయుక్తకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ రెండు సర్వే నెంబర్‌లో ఎంత మంది ఆక్రమణదారులున్నారో జాబితా సిద్ధం చేయాలని తహశీల్దార్ సులోచన రాణిని ఆయన ఆదేశించారు. తమకు 33 సెంట్లుకు గతంలో తహశీల్దార్ పట్టా ఇచ్చారని అందుకే ఆక్రమించుకున్నామని చిట్టమ్మ, వెంకటి స్పెషల్ ఆఫీసర్ కు తెలిపారు. ఆ భూమికి సంబంధించిన పట్టాను విచారణకు వచ్చినప్పుడు తీసుకురావాలని ఆయన ఆక్రమణదారులకు సూచించారు. ఈ విచారణ కార్యక్రమంలో తహశీల్దార్ సులోచన రాణి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామ్‌కుమార్, విఆర్ఒ, విలేజ్ సర్వేయర్, మండల సర్వేయర్ తదితరులు పాల్గొన్నారు.

'మన డబ్బులు మన లెక్కలు' తెలుసుకోవాలి : పీడీ

ప్రజాశక్తి-చీపురుపల్లి

మన డబ్బులు మన లెక్కల గురించి పొదుపు సంఘంలో ప్రతి ఒక సభ్యురాలు తెలుసుకోవాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస పాణి అన్నారు. బుధవారం స్థానిక మండల సమైక్య కార్యాలయంలో మండల సమైక్య కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా జరిగే మండల సమాఖ్య కార్యవర్గ సమావేశానికి అన్ని గ్రామ సంఘాల నుంచి అధ్యక్షులు హాజరు కావాలన్నారు. సభ్యురాలు వారీగా అప్పు బకాయి వివరాలు తయారు చేయాలని, సిబ్బందిని ఆదేశిస్తూ, సిఐఎఫ్ బకాయి వసూలు చేయడంలో సభ్యులు కూడా వెళ్లి అడగాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం ఎన్.అప్పలనాయుడు, ఎల్‌సి దుర్గాప్రసాద్, సీసీలు సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: మండలంలోని సుంకరపాలెం, గవర పాలెం, గులివిందాడ, దెందేరు, ఒడ్డుపేట, సీతం పేట, కొత్తూరు, కంటకాపల్లి గ్రామాల్లో మన డబ్బులు మన లెక్కలు కార్య క్రమంలో భాగంగా మహిళా సంఘాల సభ్యులు బుధవారం అవగాహన ర్యాలీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సిసిలు భారతి, అప్పలనాయుడు, అప్పలస్వామి, పద్మావతి, విఒఎలు, పాల్గొన్నారు.

డెంకాడ: స్వయం సహాయక సంఘాల సభ్యులకు సంఘ నిధులుపై మన డబ్బు మన లెక్కలు అంశంపై అమకాం, ఆకులపేట, బొడ్డవలస, బంటుపల్లి, డెంకాడ, బెల్లం గ్రామాల్లో బుధవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులకు సంఘం నిధులు వినియోగం, ఆర్థిక పారదర్శకత పై అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి శ్రీనివాసరావు, సిసిలు సూరిబాబు, విశ్వేశ్వరరావు, మంజుశ్రీ, విఒలు కూటమి నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత

ప్రజాశక్తి - చీపురుపల్లి

గ్రామాల వారీగా ఎక్కడా చెత్త నిల్వలు లేకుండా పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యత నివ్వాలని చీపురుపల్లి డిఎల్‌డిఒ హేమ సుందర్ అన్నారు. బుధవారం పట్టణ పరిధిలోని వంగపల్లి పేట రామాంజనేయ కాలనీ, ఆంజనేయపురం ప్రాంతాలలో పర్యటించి చెత్త నిల్వలను తొలగించడానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంటూ రోగాలు ప్రబలకుండా ముందస్తు చర్యలో భాగంగా పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. పట్టణ పరిధిలోని 3వ సచివాలయాన్ని సందర్శించి ఇంటి పన్నుల వసూళ్లు, జిఎస్‌డబ్ల్యుఎస్ సర్వేలపైన పూర్తిగా దృష్టి సారించి సిబ్బంది పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సానిటరీ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, జూనియర్ అసిస్టెంట్ ఎన్.రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం అక్షరాస్యత మండలంగా తీర్చిదిద్దుదాం

ప్రజాశక్తి- గంట్యాడ

మండలాన్ని శత శాతం అక్షరాస్యత మండలంగా తీర్చిదిద్దుదామని ఎంపిపి పీరుబండి హైమావతి అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం జరిగిన ఉల్లాస నిరక్షరాస్యత నిర్మూలన శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉల్లాస్ నిరక్షరాస్యత నిర్మూలన కార్యక్రమాలను నిర్వహించి అక్షరాస్యులను తయారు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రమణమూర్తి, ఎపిఎం సులోచన దేవి, ఎపిఒ సుందర్రావు, క్లస్టర్ కోఆర్డినేటర్లు విఒఎలు తదితరులు పాల్గొన్నారు.

సబ్‌జైలు తనిఖీ

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణ ప్రసాద్ విజయనగరం సబ్ జైలును ఆకస్మికంగా బుధవారం తనిఖీ చేశారు. కారాగారంలో ఉన్న ఖైదీలకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. చట్టాలపై అవగాహన కల్పించారు. ఖైదీల పట్ల సిబ్బందిగాని, తోటి ఖైదీలు గాని ఎటువంటి వివక్షత చూపించరాదని తెలిపారు. సబ్ జైల్లో కొనసాగుతున్న జైల్ లీగల్ ఎయిడ్ క్లినిక్ లను తనిఖీ చేసిరి. అనంతరం కంటోన్మెంట్ లో ఉన్న రెయిన్‌బో చిల్డ్రన్ హోమ్‌ను సందర్శించారు. ఆ సమయంలో 13 మంది పిల్లలు ఉన్నట్లు గుర్తించారు. పిల్లలకు అందుతున్న ఆహారం గురించి వారి నుంచి వివరాల అడిగి తెలుసుకున్నారు.

పలు అంశాలపై చర్చ

ప్రజాశక్తి-విజయనగరం కోట

మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి మామిడి అప్పలనాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చ జరిగింది. ఎంపిటిసిలు, సర్పంచులు అడిగిన అనేక ప్రశ్నలకు మండల స్థాయి అధికారులు సమాధానాలు తెలిపారు. చెల్లూరు ఎంపిటిసి బోడసింగి శంకర్రావు మాట్లాడుతూ తమ గ్రామంలో 20 విద్యుత్ స్తంభాలు పాడయ్యాయని, వాటి స్థానంలో కొత్తవి వేయాలని కోరారు ఇళ్లపై నుంచి వెళ్తున్న విద్యుత్తు వైర్ల మార్చాలని అన్నారు. చెల్లూరు గ్రామ పరిసరాల్లో జాతీయ రహదారిపై హైమాస్క్ లైట్లు వెలగడం లేదని, విద్యుత్ సరఫరా బిల్లు కట్టలేదని నిలుపుదల చేశారన్నారు రహదారిపై లైటింగ్ లేకపోవడంతో రాత్రి వేళల్లో ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని వెంటనే విద్యుత్ పునరుద్ధరించాలని కోరారు స్పందించిన డి4 ఎఇ మాట్లాడుతూ లక్ష రూపాయలు విద్యుత్ బకాయిలు ఉన్నాయని తెలిపారు. సమావేశంలో ఎంపిడిఒ గంటా వెంకట్రావు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి, మండల ఉపాధ్యక్షులు కొసరి నిర్మల, నారాయణ, తాహశీల్దార్ కూర్మనాద్ రావు, పిఎసిఎస్ చైర్మన్ కోరాడ వెంకటరావు, ఎంపిటిసి సభ్యులు రాజేష్ బాబు, పలు గ్రామాల ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో సౌకర్యాలు కల్పించాలని ధర్నా

ప్రజాశక్తి - గజపతినగరం

గజపతినగరం, పురిటిపెంట జగనన్న కాలనీలో రోడ్లు, కాలువలు, వీధిలైట్లు, మంచినీటి కొళాయిలు వంటి కనీస సదుపాయాలు లేక స్థానికులు అనుభవిస్తున్న తీవ్ర ఇబ్బందులపై సిపిఎం ఆధ్వర్యంలో బుధవారం ఎంపిడిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సిపిఎం నాయకులు జి.శ్రీనివాస్, దాసరి సింహాద్రి ఆధ్వర్యంలో జరిగిన ధర్నా కార్యక్రమంలో, కాలనీవాసులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్లు బాగోకపోవడంతో వర్షపు నీరు నిలిచిపోవడం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం వల్ల తరచుగా విష సర్పాలతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా కొరవడిందని, వీధిలైట్లు పోయినా పంచాయతీ అధికారులు వేయడం లేదని, ఇంటింటికి మంచినీటి కొళాయిలు లేవని తాగునీరు లేకుండా ఎలా జీవించాలని ప్రశ్నించారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎఒ కే. పుష్పలతకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆర్.శంకర్ రావు, వి.సత్య, ఆర్. మంగ, బి.భవాని, ఎస్. గౌరీ, అన్నపూర్ణ, పి. కుమారి పాల్గొన్నారు.

కొనసాగిన క్రీడా పోటీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రెండో రోజు బుధవారం కూడా ప్రభుత్వ ఉద్యోగులకు జిల్లా స్థాయి క్రీడా పోటీలు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జరిగాయి. బుధవారం క్రికెట్, చదరంగం, వాలీబాల్ క్రీడలకు ఎంపికలు జరిగాయి. 90 మంది వరకు ఉద్యోగులు పాల్గొన్నారు. వీరిలో ఎంపిక చేసిన జట్లు రాష్ట్ర పోటీలకు వెళ్తాయని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు.

రాష్ట్రస్థాయి కబడ్డీకి విద్యార్థులు

దత్తిరాజేరు: మండలంలోని శికారుగంజి మోడల్ స్కూల్ విద్యార్థులు ఎస్.దుర్గాప్రసాద్ పి. అనూష రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ 11న రామభద్రపురంలో జరిగిన కబడ్డీ పోటీలలో ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పీడీ రాజేష్‌ను తెలిపారు. వీరు ఈ నెల 15,16,17 తేదీల్లో పల్నాడులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు హాజరవుతారని అన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ

కొత్తవలస: వాగ్దేవి కళాశాల విద్యార్థులు సాగర్, హర్షవర్ధన్, జగదీశ్ గజపతినగరంలో జరిగిన కబడ్డీ అండర్-19 పోటీలలో పాల్గొని రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారని కళాశాల కరస్పాండెంట్ కోటిన మహేశ్వరరావు బుధవారం తెలిపారు. కళాశాల డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ తమ అకాడమీలో విద్యార్థులకు ఉత్తమ శిక్షణ ఇస్తున్నామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్స్ సతీష్, రాజ్‌కుమార్, విద్యార్థులను అభినందించారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై ఒత్తిడి చేయొద్దు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఫారాం పాండ్స్ టార్గెట్స్ పేరుతో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లపై ఒత్తిడి తేవద్దని బుధవారం ఎంపిడిఒ, ఎపిఒలకు సిఐటియు ఆధ్వర్యాన వినతి అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు సాయి, ఈశ్వరమ్మ మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉండటంతో కూలీలు కోతలకు వెళ్ళిపోతున్నారని, రైతులు ఫారం పాండ్స్‌కు భూమి ఇవ్వడం లేదని, అయినా తమ వంతు ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. టార్గెట్ పేరుతో మాపై ఒత్తిడి చేయొద్దని కోరారు. వినతినిచ్చిన వారిలో పలువురు ఫీల్డు అసిస్టెంట్లు ఉన్నారు.

మహారాజశ్రీ అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
O.S.188/2023

Between :
పెంకి చంటిబాబు .....వాది
And :
పెంకి విజయమ్మ వగైరాలు .....ప్రతివాదులు
నోటీసు
1. పెంకి అలెగ్జాండర్, S/o లేటు రామమోహన్, వయస్సు 46 సం॥లు, S.C. కోలనీ, కోమటిపల్లి గ్రామం, బొబ్బిలి మండలం, విజయనగరం జిల్లా. (2వ ప్రతివాది)
2. పెంకి పురుషోత్తం S/o లేటు రామమోహన్, వయస్సు 40 సం॥, - డిటో చిరునామా - (3వ ప్రతివాది)
3. పెంకి పురుషోత్తం D/o లేటు రామమోహన్, వయస్సు 35 సం॥, - డిటో చిరునామా - (4వ ప్రతివాది)

పై నెంబరు దావాలో మీరు 2,3,4వ ప్రతివాదులుగా వుండి పై నెంబరు దావాలో కోర్టుకు హాజరు కావడం లేదు. పై నెంబరు దావా మీ హాజరు నిమిత్తం తే 19-11-2025దీ నాటికి వాయిదా ఉన్నది. కనుక మీరు **తే 19-11-2025దీ ఉదయం గం॥ 10-30**లకు పై నుదహరించిన కోర్టులో మీరు గాని, మీ వకీలు ద్వారా గాని హాజరు కావలెనని యిందు మూలముగా తెలియజేయడమైనది. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మాణం చేయబడును.

చందాన సూర్యనారాయణ
బలగ రామకృష్ణ
బోగి దాసు
వాది తరపు న్యాయవాదులు
బొబ్బిలి, విజయనగరం జిల్లా.

IN THE HONOURABLE COURT OF THE V ADDITIONAL DISTRICT JUDGE CUM MAHILA SESSIONS JUDGE AT VIZIANAGARAM
I.A.No. 3 /2023 in 0.S.NO.73/2016

Between:
Sreedharala Rajesh Gupta . . . Petitioner/Plaintiff.
And:
Smt B.Lakshmi Narasamma and others ... Respondents./Defendants.
To
R-21: Kakarlapudi Satyanarayana Raju, S/o late Lakshmi Narasimha Raju, Hindu, aged 73 years, Rajula Veedhi, Bhogapluram Village & Mandal, Vizianagaram District.
R-46: Panduru Narasinga Rao, S/o Amrutha Lingam, Hindu, aged 58 years, Flat No. 116, Resident of D.No. 11-28, Teachers Colony, Near Siddantham Master Veedhi, Garlvidi Mandal, Vizianagaram District.
R-95: Rambabu Dola, Hindu, resident of House No. 25-5-29, Flat No. 405, Akshayanidhi Heights, Subrahmanyapeta, Vizianagaram..
R-96: Nimmidi Krishna Padma, Hindu, 25-5-29, Flat No. 405, Akshayanidhi Heights, Subrahmanyapeta, Vizianagaram Town and District.
R-104: Smt Dola Vaiajaya Lakshmi, W/o K.Mohana Rao, Hindu, Sri Rama Towers, Near Port Vizianagaram, Vizianagaram Town and District.
R-123: Lenka Rajya Lakshmi, W/o Gamidi Koteswara Rao, Hindu, aged 44 years, Flat No. 508, Resident of Flat No. F-3, Sri Sai Enclave Kothamadappa Veedhi, Chinnapalli Veedhi, Vizianagaram Town and District.
. . . Proposed Respondents 21, 46, 95, 96, 104,123.

Please take notice that the above named petitioner/Plaintiff has instituted the above IA. Against you Under Order 1 Rule 10 of C.P.C.for adding of R.1 to R.120 as non-joinder of necessary parties in the above said suit and proceedings and the same is stands posted to **24-11-2025** for your appearance, on that day you are personally or through Advocate attend before the Honourable court at **10.30.A.M** failing which the matter will be heard and determined in your absence ex-parte as per law.

P.SATYANARAYANA MURTHY
P.V.S.A.MURTHY,
Advocates,
Visakhapatnam.Cell : 9440115234

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT VIZIANGARAM.
O.S. No. 733/2022.

BETWEEN:
CANARA BANK, Main Branch, Vizianagaram, reptd. By it's Branch Manager ....Plaintiff.
AND:
Goddu Sateesh Kumar......Defendant.
NOTICE TO DEFENDANT.
Goddu Sateesh Kumar, S/o Varaha Narasimha Murthy, D.No.1-1/1-106, Ganjipeta, Contonment, Vizianagaram Town and District.

Hearing date: 20-11-2025

పైన తెలిపిన కేసులో ప్లయింటిఫ్ మీపై దావా దాఖలు చేసి యున్నారు. సదరు కేసులో పై కోర్టు వారి నుండి మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపినను మీరు తీసుకోనందున మీకు నోటీసు నిమిత్తము శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారము పై నెంబర్ కేసు తే 20-11-2025 దిన వాయిదా వున్నదని ఈ పత్రిక ముఖంగా తెలియపరుస్తూ సదరు తేది అనగా **తే 20-11-2025 దిన ఉదయం గం. 10.30 నిమిషాలకు** మీరు కానీ లేదా మీ తరపున వకీలు గారి ద్వారా కానీ పై కోర్టులో ప్రత్యక్షంగా హాజరు అయి మీ తరపున వాదనలు విన్నవించుకోవలెను. లేనియెడల పైన తెలిపిన కేసులో మీ పరోక్షమున విచారించి తీర్మాణించెదరని శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారము ఈ ప్రకటన ద్వారా తెలియపరచడమైనది.

// BY THE ORDER OF THE HONOURABLE COURT//

ఇట్లు
సంఘం రెడ్డి మధు సూధన రావు,
ప్లయింటిఫ్ తరపున న్యాయవాది
విజయనగరం, Cell:9440163944.

FACOR ALLOYS LIMITED

Regd. Office : Shreeramnagar - 535 101, Garividi, Dist. Vizianagaram (A.P.) CIN: L27101AP2004PLC043252
WEBSITE : www.facoralloys.in **PHONE :** +91 8952 282029 **FAX :** +91 8952 282188 **E-MAIL :** facoralloys@falgroup.in

STATEMENT OF UNAUDITED STANDALONE AND CONSOLIDATED FINANCIAL RESULTS FOR THE QUARTER AND HALF YEAR ENDED 30TH SEPTEMBER, 2025

(₹ in Lakhs)

SR. NO.	PARTICULARS	STANDALONE						CONSOLIDATED					
		Quarter Ended			Half Year Ended		Year Ended	Quarter Ended			Half Year Ended		Year Ended
		30th September 2025	30th June 2025	30th September 2024	30th September 2025	30th September 2024	31st March 2025	30th September 2025	30th June 2025	30th September 2024	30th September 2025	30th September 2024	31st March 2025
		Unaudited	Unaudited	Unaudited	Unaudited	Unaudited	Audited	Unaudited	Unaudited	Unaudited	Unaudited	Unaudited	Audited
1	Total Income from operations	110.77	14.43	16.54	125.20	999.06	1,058.30	110.77	14.43	15.96	125.20	999.06	1,058.30
2	Net Profit / (Loss) for the period (before Tax, Exceptional and / or Extraordinary items)	(737.65)	(691.33)	(363.75)	(1,428.98)	135.91	(617.31)	(737.69)	(691.35)	(357.73)	(1,429.04)	135.95	(617.27)
3	Net Profit / (Loss) for the period (before Tax, after Exceptional and / or Extraordinary items)	(464.29)	(650.07)	(2,690.75)	(1,114.36)	(2,192.08)	(6,121.12)	(464.33)	(650.09)	(2,684.73)	(1,114.42)	(2,192.04)	(6,121.08)
4	Net Profit / (Loss) for the period after Tax (after Exceptional and / or Extraordinary items)	(367.04)	(465.56)	(2,612.63)	(832.60)	(1,982.23)	(5,021.47)	(367.08)	(465.58)	(2,606.61)	(832.66)	(1,982.19)	(5,021.43)
5	Total Comprehensive Income for the period [comprising Profit/ (Loss) for the period (after tax) and Other Comprehensive Income (after tax)]	(387.27)	(485.79)	(2,627.16)	(873.06)	(2,011.29)	(5,103.70)	(387.31)	(485.81)	(2,621.14)	(873.12)	(2,011.25)	(5,103.64)
6	Equity Share Capital	1,955.48	1,955.48	1,955.48	1,955.48	1,955.48	1,955.48	1,955.48	1,955.48	1,955.48	1,955.48	1,955.48	1,955.48
7	Other Equity (excluding Revaluation Reserve) #	—	—	—	—	—	—	—	—	—	—	—	—
8	Earnings per share (before extraordinary items)												
	(of ₹ 1/- each) (not annualised) :												
	(a) Basic	(0.19)	(0.24)	(1.34)	(0.43)	(1.01)	(2.57)	(0.19)	(0.24)	(1.33)	(0.43)	(1.01)	(2.57)
	(b) Diluted	(0.19)	(0.24)	(1.34)	(0.43)	(1.01)	(2.57)	(0.19)	(0.24)	(1.33)	(0.43)	(1.01)	(2.57)

Notes:
1 The above is an extract of the detailed format of Quarterly and Half Yearly Financial Results filed with the Stock Exchange under Regulation 33 of the SEBI (Listing Obligations and Disclosure Requirements) Regulation, 2015. The full format of the Quarterly and Half Yearly Financial Results are available on the website of Stock Exchange at www.bseindia.com and on the Company's website www.facoralloys.in.
2 Previous period figures are regrouped/rearranged wherever necessary to facilitate comparison.

Place : Nagpur
Date : 12th November, 2025

QR Code

For FACOR ALLOYS LIMITED,
ASHISH SANTOSH AGRAWAL
WHOLE-TIME DIRECTOR
DIN: 02148665

AAA

విద్యార్థులను అభినందిస్తున్న ఎస్‌పి ఎఆర్ దామోదర్

భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలి : ఎస్‌పి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

2023-24 విద్యా సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభకనబర్చి, మంచి మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించిన హోంగార్డుల పిల్లలను జిల్లా ఎస్‌పి ఎ.ఆర్.దామోదర్ బుధవారం జిల్లా పోలీసు కార్యాలయానికి పిలిపించి అభినందించి మెరిట్ స్కాలర్ షిప్‌లను బుధవారం అందజేసారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఉన్నత విద్యతో మంచి భవిష్యత్తు సాధ్యమవుతుందని, అందుకు తగిన విధంగా విద్యార్థులు శ్రద్ధ, క్రమశిక్షణతో చదువు కోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి పి.సౌమ్యలత, వెల్ఫేర్ ఆర్ఐ ఎన్.గోపాల నాయుడు, పోలీసు ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

నియోజకవర్గంలోని ఐదు మండలాలకు ఇటీవల నియమితులైన టిడిపి మండల అధ్యక్ష, కార్యదర్శులతో పాటు క్లస్టర్లు, యూనిట్లు, బూత్ ఇంఛార్జిలు, గ్రామ కమిటీ అధ్యక్షులు, మండల కమిటీ సభ్యుల పదవుల ప్రమాణ స్వీకారం గురువారం లక్కవరపుకోటలోని టిడిపి కార్యాలయంలో నిర్వహిస్తామని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి 5 మండలాల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పసుపు దుస్తులు ధరించి, పార్టీ సభ్యత్వ కార్డు తీసుకుని రావాలని కోరారు.

నేడు గొంప వెంకటరావు ప్రమాణ స్వీకారం

వేపాడ: టిడిపి మండల అధ్యక్షునిగా వరుసగా రెండోసారి నియమితులైన గొంప వెంకటరావు గురువారం ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి నివాసం ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సతివాడ, నెల్లిమర్ల ఐడిఎ పరిధిలో గురువారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని టౌన్ డిఇఇ పి.త్రినాధరావు ప్రకటనలో తెలిపారు. నెల్లిమర్ల పారిశ్రామిక ప్రాంతంలో నిర్మాణం రంగం 11కెవి లైన్ విస్తరణ, ఆర్‌డిఎస్‌ఎస్ వ్యవసాయ కనెక్షన్ సర్గేషన్ పనులు, చెట్టు కొమ్మలు తొలగింపు పనులు చేపడుతున్నందు వల్ల సారిపల్లి 11కెవి రూరల్ ఫీడర్ పరిధిలో సారిపల్లి గ్రామంతో బాటు ఎజిఎల్ సప్లయ్‌కు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని వినియోగదార్లు సహకరించాలని కోరారు.

న్యుమోనియాపై అవగాహన

ప్రజాశక్తి - కొత్తవలస

వియ్యంపేట పిహెచ్‌సి పరిధిలోని ఎనిమిది ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల్లో బుధవారం వైద్యాధికారి డాక్టర్ గోపాలకృష్ణ ప్రపంచ న్యుమోనియా డే పై ప్రజలకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న పిల్లలు ఉన్న తల్లులకు, 5 సంవత్సరాలు లోపు పిల్లలకి ఎక్కువగా న్యుమోనియా వ్యాపిస్తుందని జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొత్తవలస పిహెచ్‌సి వైద్యాధికారి శీతల వర్మ, ఎమ్‌ఎల్‌హెచ్‌పిలు కామేశ్వరి, ధనలక్ష్మి, అనుషారాణి, పావని, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఎఎన్‌ఎమ్స్ గౌరీ, దేవి, బేగం, సుగుణ, సుధా, సత్యవతి, అంగన్వాడీ వర్కర్స్, ఆశ వర్కర్స్ పాల్గొన్నారు.

షికారుగంజిలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- దత్తరాజేరు

మండలంలోని అమ్మసేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో షికారుగంజిలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు ఫౌండేషన్ అధ్యక్షులు సురేష్ తెలిపారు. రామభద్రపురం క్వీన్స్ ఎన్నారై ఆస్పత్రి వైద్యులు అభినయ ప్రతిమరామగాంధీ 196 మంది రోగులకు వివిధ రకాల వైద్య సేవలను అందించారు. ఎనిమిది మందికి జనరల్ సర్జరీకి ఎంపిక చేసి ఉచితంగా ఆపరేషన్ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆస్పత్రి ఎండి రమేష్ శిబిరాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒ సత్యనారాయణ, సిబ్బంది, ఫౌండేషన్ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శస్త్ర చికిత్సకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - రామభద్రపురం

ఆరికతోట యూత్ ఆధ్వర్యంలో అదే గ్రామానికి చెందిన నిరుపేద కూరపాటి సత్యారావు శస్త్ర చికిత్సకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా 21వేలు సేకరించి స్థానిక ఎస్ఐ ప్రసాదరావు చేతుల మీదుగా బుధవారం నగదు అందజేశారు. గత కొంతకాలంగా సత్యారావు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న యువత వారికి అండగా నిలిచి నగదు అందించడం సంతృప్తిని కలిగించిందని ఎస్ఐ అన్నారు. యువత గ్రామాల్లో మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు, రవాణా వంటి వాటిని నివారించేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఎస్ఐ చేస్తున్న సమాజసేవకు యువత ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ సభ్యులు అశోక్, రత్నప్రసాద్, కృష్ణ, చిన్నారావు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో సామాజిక తనిఖీ

ప్రజాశక్తి- మెరకముడిదాం

పాఠశాల పనితీరు, నిర్వహణ, అభివృద్ధి కార్యక్రమాలపై పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంచడం గూర్చి ఎంపియుపి ఇప్పలవలస పాఠశాలలో సామాజిక తనిఖీ బుధవారం నిర్వహించారు. విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి పాఠశాల వాతావరణం, బోధన నాణ్యత, మధ్యాహ్న భోజనం, మౌలిక సదుపాయాలపై నేరుగా అభిప్రాయాలను సేకరించారు. పాఠశాలకు వచ్చిన ప్రభుత్వ గ్రాంట్లు, నిధులు, వాటి ఖర్చు వివరాలను తల్లిదండ్రుల కమిటీ సభ్యులు ఉపాధ్యాయులు బహిరంగంగా వివరించారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, పాఠశాలలో మెరుగుపడాల్సిన అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో జిల్లా యువతకు ఉపాధి కల్పించండి

ప్రజాశక్తి -కంటోన్మెంట్

భోగాపురంలో నిర్మితమవుతున్న అంతర్జాతీయ విమానాశ్రయంలో వివిధ రంగాల డిపార్ట్మెంట్‌ల్లో జిల్లాకు యువతకుఉపాధి అవకాశాలు కల్పించాలని లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డిని కోరారు బుధవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. విమానాశ్రయం వలన ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 20 వేల మంది కి ఉపాధి అవకాశాలు ఉంటాయని, జిల్లాలోని మంత్రి, అధికారులు, ఎమ్మెల్యేలు దృష్టి సారిస్తే శిక్షణ ఇచ్చి యువతను నియమించుకోవచ్చని తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

ప్రజాశక్తి-విజయనగరంకోట

పత్తి రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిందని జిల్లా కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులంతా ఈ కొనుగోలు కేంద్రం లోనే వారి పంటను విక్రయించాలని, దళారీలను, మధ్యవర్తులను నమ్మవద్దని తెలిపారు. పత్తి రైతులు తమ ఉత్పత్తిని ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర రూ.8,110 కంటే తక్కువ ధరకు మధ్యవర్తులకు విక్రయించకుండా, నేరుగా రాజాం వ్యవసాయ మార్కెట్ కమిటీ పత్తి కొనుగోలు కేంద్రం వద్ద విక్రయించాలని కోరారు.

గాయపడిన మహిళ మృతి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

నగరంలోని గాజులరేగ గుబెల్ పేటకు చెందిన పిన్నింటి నారాయణమ్మ (54) జిల్లా సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. టూ టౌన్ పోలీసులు కథనం ప్రకారం.. గుబేలు పేటలో నివాసం ఉంటున్న నారాయణమ్మ ఈనెల 8న ఉదయం తన ఇంటి వద్ద చుట్ట వెలిగించిన సమయంలో పిట్స్ రావడంతో నిప్పులు చీరపై పడి మంటలు రేగి చీర కు అంటుకున్నాయి. స్థానికులు చూసి 108లో ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి ఆమె మృతి చెందింది.

విజయనగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి శ్రేణులు

నెల్లిమర్ల : ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, నాయకులు, కార్యకర్తలు

రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు పరం చేయడాన్ని వ్యతిరేకిస్తూ వైసిపి ఆధ్వర్యాన జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో బుధవారం ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు చేపట్టారు. చీపురుపల్లిలో శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ, ఎంపి బెల్లాన చంద్రశేఖర్ ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు.

గజపతినగరంలో మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య ఆధ్వర్యా వందలాది మంది ర్యాలీ చేపట్టారు.

నెల్లిమర్లలో మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పి.సురేష్‌బాబు ఆధ్వర్యాన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా కోటి సంతకాలు సేకరణ చేపట్టారు. అనంతరం రామతీర్థం జంక్షన్ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టారు.

రాజాంలో నియోజకవర్గ ఇంచార్జ్ డాక్టర్ తలే రాజేష్ ఆధ్వర్యంలో జిఎంఆర్ ఐటి నుంచి ఎమ్మార్వో కార్యాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్ రాజ్‌కు వినతి అందజేశారు.

శృంగవరపుకోట : మాజీ ఎమ్మెల్యే శోభ హైమావతి, వైసిపి రాష్ట్ర కార్యదర్శి నెక్కల నాయుడు బాబు అన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి తాహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.

విజయనగరంలో మాజీ డిప్యూటీ స్పీకర్‌కోలగట్ల వీరభద్రస్వామి ఆధ్వర్యాన ర్యాలీ, అనంతరం తహశీల్దార్ కార్యాలయంవద్ద ధర్నా చేశారు.

శృంగవరపుకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

బొబ్బిలి : ర్యాలీలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు

పార్టీని మరింత బలోపేతం చేయాలి : మంత్రి

ఉత్సాహంగా టిడిపి మండల అధ్యక్షుల ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-గజపతినగరం

పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్ సూచించారు. గజపతినగరం నియోజకవర్గంలో నూతన మండల పార్టీ అధ్యక్షుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా జరిగింది. బుధవారం బోడసింగి పేట సమీపనగల బెల్లాన కన్వెన్షన్ లో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గజపతినగరం మండల పార్టీ అధ్యక్షులుగా గంట్యాడ శ్రీదేవి, గంట్యాడ మండల పార్టీ అధ్యక్షులుగా కొండపల్లి భాస్కరరావు, దత్తిరాజేరు మండల టిడిపి అధ్యక్షులుగా చప్ప చంద్రశేఖర్, బొండపల్లి మండల అధ్యక్షులుగా రాపాక అచ్చం నాయుడు, జామి మండల అధ్యక్షులుగా పోలిపల్లి స్వామి నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. వీరందరినీ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అభినందించారు. పదవులను స్వీకరించిన నాయకులకు గజపతినగరం మార్కెట్ కమిటీ ఛైర్మన్ పి.వి.వి. గోపాలరాజు, మాజీ జెడ్‌పిటిసి మక్కువ శ్రీధర్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం మంత్రి శ్రీనివాస్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేయాలని, ప్రజల్లోకి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను, పథకాలను విస్తృతంగా తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు వివి ప్రదీప్ కుమార్, పిఎసిఎస్ ఛైర్మన్ లెంక బంగారు నాయుడు, రామ్ కుమార్, లెంక చిన్నం నాయుడు, కర్రి సన్యాసిరావు, బొత్స రమణ, బొత్స సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మన్యం గజగజ

పెరిగిన చలి తీవ్రత

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీలో చలిమంట కాగుతున్న గిరిజన యువత

మన్యం జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు దట్టమైన పొగ మంచు, చల్లని గాలులకు మన్యం గజగజలాడుతోంది. నవంబర్‌లోనే ఏజెన్సీ అంతటా పొగమంచు కప్పేస్తోంది. దీంతో రహదారి కనిపించని పరిస్థితి నెలకొంది. ఉదయం వేళ ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికులు 8 గంటల తరువాత ప్రయాణాలు పెట్టుకుంటున్నారు. రాత్రి వేళ ఉష్ణోగ్రతలు 14 డిగ్రీల స్థాయికి పడిపోతున్నాయి. ముఖ్యంగా గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ చుట్టూ ఎత్తయిన కొండలు ఉండటం, చుట్టూ నీరు, దట్టమైన పొగ మంచు కురవడంతో ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదు అవుతున్నాయి. చలి తీవ్రత కారణంగా వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. డిసెంబర్, జనవరి నెలల్లో చలి ప్రభావం అత్యధిక స్థాయిలో ఉంటుంది.

ఐటిడిఎకి అధికారులు కావలెను

ఐటిడిఎలను నీరుగార్చే విధానాలను సర్కారు అవలంబిస్తోందా? గిరిజనాభివృద్ధిపై ప్రభుత్వం శీతకన్ను వేస్తోందా? అంటే అవుననే సమాధానమే వినిపిస్తోంది. గిరిజనుల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ఏర్పాటుచేసిన ఐటిడిఎలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు చేస్తోంది. ఐటిడిఎలో కీలకపోస్టులను ఏళ్ల తరబడి భర్తీ చేయకపోవడమే అందుకు నిదర్శనం. ఒకటీ రెండూ కాదు.. కీలకపోస్టులన్నీ ఇన్‌ఛార్జులతో నెట్టుకొచ్చే దుస్థితి దాపురించింది.

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఐటిడిఎలో ఏడాదిన్నరగా కీలకమైన పిఒ పోస్టును ఇన్‌ఛార్జితో నెట్టుకొస్తున్నారు. సీతంపేట ఐటిడిఎ పరిధిలో 20 మండలాల్లో సుమారు రెండు లక్షల మంది గిరిజనులు నివశిస్తున్నారు. రెగ్యులర్ పిఒ ఉంటే ఐటిడిఎ సంక్షేమ పథకాలు పేదలకు నేరుగా అందేలా చూడాల్సిన బాధ్యత ఉంటుంది. అంతేకాక రహదారులు, భవనాలు పర్యవేక్షణ, నూతన పథకాలు గిరిజనులకు చేరువ చేయడం, విద్యా ప్రమాణాలు, గిరిజనుల ఆరోగ్యంపై దృష్టిపెట్టడం, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం, అత్యవసర సమయంలో కీలక నిర్ణయాలు తీసుకోవడం, ఐటిడిఎ ద్వారా కొత్త కార్యక్రమాలు ప్రవేశ పెట్టడం.. ఇలా అన్ని శాఖలపై పట్టుసాధించి ఐటిడిఎ అభివృద్ధికి కృషి చేయాల్సి ఉంది. గతేడాదిన్నర కాలంగా పాలకొండ సబ్‌కలెక్టర్‌కు ఇన్‌ఛార్జి పిఒగా అదనపు బాధ్యతలు అప్పగించడంతో దేనికీ న్యాయం చేయలేని పరిస్థితి నెలకొంది. గతంలో యశ్వంత్‌కుమార్ పాలకొండ సబ్‌కలెక్టర్‌గా ఉన్న సమయంలో సీతంపేట ఐటిడిఎ పిఒగా అదనపు బాధ్యతలు అప్పగించారు. సుమారు 11 నెలలు ఇన్‌ఛార్జి పిఒగా కొనసాగారు. అనంతరం ఐఎఎస్ బదిలీల్లో పాలకొండ సబ్‌కలెక్టరుగా పవర్ స్వప్నిల్ జగన్నాథ్‌ను ప్రభుత్వం నియమించింది. దాంతోపాటు సీతంపేట ఐటిడిఎ పిఒగా అదనపు బాధ్యతలు అప్పగించారు. పిఒగా ఆగస్టులో బాధ్యతలు స్వీకరించారు. రెండు బాధ్యతలతో దేనికీ న్యాయం చేయలేని పరిస్థితి నెలకొంది.

సీతంపేట ఐటిడిఎ కార్యాలయం

ఐటిడిఎ ఎపిఒ చినబాబు రెగ్యులర్ అయినప్పటికీ వ్యక్తిగత పనులపై దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. ప్రాజెక్టు హార్టికల్చర్ అధికారి వెంకట గణేష్‌కు ఇన్‌ఛార్జి ఎపిఒ బాధ్యతలు అప్పగించారు. ఆయన ఇప్పటికే అదనంగా ప్రాజెక్టు అగ్రికల్చర్ అధికారి బాధ్యతలు చూస్తున్నారు. ఆయనకు హార్టికల్చర్ ద్వారా 20 మండలాల్లో గిరిజనులకు జీడి మామిడి, పనస, పైనాపిల్, తదితర పంటలపై అవగాహన కల్పించాల్సి ఉంది. దాంతోపాటు వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం అందించిన పనిముట్లు రాయితీలో ఇవ్వాల్సి ఉంది. వ్యవసాయ సంబంధిత కార్యక్రమాలన్నీ చేపట్టాలి. ఎపిఒగా అదనపు బాధ్యతలతో ఐటిడిఎలో ప్రతి ఫైలు చూడాల్సి ఉంటుంది. ఐటిడిఎ కూడా పర్యవేక్షణ చేయాల్సి ఉంది. మూడు బాధ్యతల స్వీకరించడంతో తలకు మించిన భారం అవుతుంది.

డిడి అన్నదొర రెగ్యులర్ అయినా, ఐటిడిఎ కేంద్రమైన ఎటిడబ్ల్యూఒ పోస్టు ఖాళీగా ఉండటంతో అదనపు బాధ్యతలు అప్పగించారు. దీంతో డిడిగా 47 ఆశ్రమ పాఠశాలలు, 16 పోస్టుమెట్రిక్ వసతిగృహాలపై పర్యవేక్షణ చేయాల్సి ఉంది. అయితే అదనంగా ఎటిడబ్ల్యూఒ విధులు అప్పగించడంతో డిడికి భారమౌతుంది. సుమారు 15 వేల మంది విద్యార్థుల ఆరోగ్యం, విద్యా ప్రమాణాలు మెరుగు పరచడం. నిర్వహణ పర్యవేక్షణ, ఉద్యోగుల జీతాలు, ఇలా అన్ని చూడాల్సిన బాధ్యత ఉంది.

గిరిజన సహకార సంస్థ (జిసిసి)కి గత మూడేళ్లుగా రెగ్యులర్ డిఎం లేక ఇన్‌ఛార్జులతోనే నెట్టుకొస్తున్నారు. గిరిజన సహకార సంస్థ జనరల్ మేనేజర్ సంధ్యారాణి విశాఖపట్నంలో ఉంటారు. సీతంపేట డివిజనల్ కార్యాలయంలో డిఎంగా అదనపు బాధ్యతలు అప్పగించారు. డిఎం అత్యవసరమైతే తప్ప రాలేని పరిస్థితి నెలకొంది. సీతంపేట ఐటిడిఎ పరిధిలో ఉన్న వసతిగృహాలకు జిసిసి ద్వారా నిత్యావసర సరుకులు సరఫరా చేయాల్సి ఉంది. డిపోల పర్యవేక్షణ, అటవీ ఉత్పత్తుల సేకరణ, ధాన్యం కొనుగోలు.. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా బాధ్యతలు ఉన్నాయి.

పశుసంవర్ధ శాఖ ఎడి శ్రీనివాసరావు తెర్లాంలో మూడు రోజులపాట విధులు నిర్వహిస్తే, సీతంపేట మండలంలో మూడు రోజులపాటు పనిచేస్తున్నారు. ఐటిడిఎ ఎఒ సునీల్‌కు అదనంగా మేనేజర్ బాధ్యతలు అప్పగించారు. ఎఎఒ విజయరాణికి అదనంగా ఇన్‌ఛార్జి అకౌంట్ మేనేజర్ పోస్ట్ బాధ్యతలు అప్పగించారు.

ధాన్యం కొనుగోలు ప్రారంభించాలి

సిపిఎం జిల్లా నాయకులు వేణు

ప్రజాశక్తి-సీతానగరం

జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సిపిఎం జిల్లా నాయకులు రెడ్డి వేణు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. రైతులు ధాన్యం కోతలు కోసి, నూర్పిడి చేస్తున్నారని తెలిపారు. పేద రైతులకు పంట నిల్వ చేసుకునే సామర్థ్యం లేదని చెప్పారు. దీనిని ఆసరా చేసుకున్న ప్రయివేటు వ్యక్తులు, దళారులు రైతులను దగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లాలో సీతానగరం, బలిజిపేట, తదితర మండలాల్లో ముమ్మరంగా నూర్పిళ్లు సాగుతున్నాయని చెప్పారు. మరోవైపు నేటికీ ఆధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించలేదన్నారు. వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు రక్షణ కల్పించాలని, కౌలు కార్డులు ఇవ్వని వారికి వెంటనే మంజూరు చేయాలని కోరారు. కేరళ ప్రభుత్వం మాదిరిగా ధాన్యం పండించే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అదనంగా రూ.600 బోనస్ ప్రకటించాలని డిమాండ్‌చేశారు. సమావేశంలో సిపిఎం మండల నాయకులు గవర వెంకటరమణ, రాయిపల్లి రాము, ఆర్.ఈశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టంలో బుధవారం ఎంఇఒ-2 ఆర్.ఆనందరావు ఆధ్వర్యంలో విద్యా ర్థులకు కల్చరల్ పోటీలు నిర్వహించారు. విజేతలు గురువారం జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఇఒ తెలిపారు. న్యాయనిర్ణేతగా గౌరునాయుడు వ్యవహరించారు.

సీతానగరం : స్థానిక ఎంఆర్‌సి భవనంలో మండల స్థాయి ఆటలు పోటీలను బుధవారం నిర్వహించారు. విజేతలను జిల్లా స్థాయికి పంపించనున్నట్లు ఎంపిడిఒ సిహెచ్ వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒలు జి.సూరిదేముడు, ఎం.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలాభివృద్ధిపై దృష్టి

ప్రజాశక్తి-వీరఘట్టం

గ్రామాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపిడిఒ బి.వెంకటరమణ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై ప్రణాళికలు వేయాలన్నారు. ప్రతి ఒక్కరూ ప్రణాళికా ప్రకారం పనిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ సిహెచ్ శంకర్రావు, మండల స్థాయి అధికారులు జి సత్యం నాయుడు, డి.కళ్యాణిదుర్గ, జె.సౌజన్య, డి.కావ్యశ్రీ, జ్ఞానమ్మ, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

అయిన వారికి ఆకులు.. కాని వారికి కంచాలు

• మంత్రి ఇలాకాలో తెలుగు తమ్ముళ్ల అసంతృప్తి

ప్రజాశక్తి-పార్వతీపురం

గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి సొంత నియోజకవర్గంలో నివురు కప్పిన నిప్పులా అసంతృప్తి రాజుకుంటోంది. పార్టీ ఆవిర్భావం నుంచి అంటిపెట్టుకుని ఉన్న సీనియర్ నాయకులను దూరం పెట్టిన పరిస్థితి కనిపిస్తోంది. గత 16 నెలలుగా నియోజకవర్గంలో మంత్రి సంధ్యారాణి వ్యవహార్‌శైలిపై సీనియర్ నాయకులు, కార్యకర్తలు కక్కలేక, మింగలేక అన్నట్లు వ్యవహరిస్తున్నారు. పార్టీలో తాము ఎదుర్కొంటున్న అవమానాలను, ఇబ్బందులను ఎవరితో చెప్పుకోవాలో తెలియని అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇటీవల మంత్రి సిఫార్సుతో చేపట్టిన నామినేటెడ్ పదవుల భర్తీలో నియోజకవర్గంలో ప్రధాన సామాజిక తరగతులకు చెందిన నాయకులకు మొండిచేయి చూపడం చర్చనీయాంశమవుతోంది.

తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా పట్టణానికి టిడిపి మాజీ కౌన్సిలర్ మజ్జి చిరంజీవిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పట్టణ పార్టీలో గాని, మండల పార్టీలో గాని కాపు సామాజిక తరగతికి చెందిన అనేకమంది నాయకులు ఉన్నారు. వారందరినీ కాదని కాపు సామాజిక తరగతికి చెందని నాయకుడిని కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించడం పార్టీ శ్రేణులను విస్మయానికి గురిచేస్తోంది. సాలూరు, పాచిపెంట, మెంటాడ, మక్కువ మండలాలతోపాటు మున్సిపాలిటీలోనూ అదే సామాజిక తరగతికి చెందిన నాయకులు చాలామంది ఉన్నప్పటికీ మొండిచేయి చూపడంతో వారంతా తీవ్ర అంతర్మథనం చెందుతున్నారు. శ్యామలాంబ ఆలయ ట్రస్టు కమిటీ నియామకంలోనూ మరో సామాజిక తరగతికి చెందిన నాయకులను విస్మరించడం వివాదాస్పదమవుతోంది. నియోజకవర్గంలో మైనారిటీ నాయకుడికి, వైసిపి నుంచి ఎన్నికల ముందు టిడిపిలో చేరిన నాయకులకు ట్రస్ట్ కమిటీలో ప్రాధాన్యత కల్పించడంతో సీనియర్ నాయకులు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్న పరిస్థితి ఏర్పడింది. బుధవారం శంబర ఆలయ ప్రాంగణంలో ట్రస్టు కమిటీ సభ్యులు ప్రమాణ స్వీకారం జరిగింది. నియామకమైన పది మంది సభ్యులలో సగం మంది వైసిపి నుంచి వలస వచ్చిన నాయకులేనన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

మంత్రి సంధ్యారాణి వ్యవహార శైలి మొదటి నుంచి అయిన వారికి ఆకులు, కాని వారికి కంచాలు అన్న చందంగా ఉందనే వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. శంబర పోలమాంబ ట్రస్ట్ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి స్థానిక నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కాలేదు. ఈ పరిస్థితిని ముందే ఊహించిన మంత్రి సంధ్యారాణి వ్యూహాత్మకంగా నియోజకవర్గంలో నాలుగు మండలాల నుంచి క్లస్టర్, బూత్ కమిటీల పేరుతో నాయకులకు ట్రస్ట్ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమానికి రప్పించడం చర్చనీయాంశమైంది. నియోజకవర్గంలో టిడిపిని భూస్థాపితం చేయడమే లక్ష్యంగా మంత్రి సంధ్యారాణి పని చేస్తున్నారని మక్కువ మండలానికి చెందిన సీనియర్ నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పార్టీ అధిష్టానం నియోజకవర్గ పరిస్థితిపై దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.